సాక్షి
ఖమ్మం
శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



మూతపడిన 'విజయ' పార్లర్

విజయ డెయిరీ పార్లర్ లీజ్ గడువు ముగియడంతో మూతపడగా, విద్యాసంస్థలకు పాలు, పెరుగు సరఫరా నిలిచిపోయింది. 12లో



మంగళ, శుక్రవారం డ్రై డే

ప్రతీ మంగళ, శుక్రవారం డ్రై డే నిర్వహిస్తూ పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత ఎండ పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా సత్యప్రసాద్

- సెలవులో ఉన్న అభిలాష బదిలీ



బి.సత్యప్రసాద్

ఖమ్మంసహకారనగర్: జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా బి. సత్యప్రసాద్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్‌ను బదిలీ చేసి, సత్యప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇప్పుడు రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, అభిలాషను జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇటీవలే జిల్లాకు వచ్చిన ఆమె కొన్నాళ్లు విధులు నిర్వర్తించి సెలవులో వెళ్లారు.

11న ఐటీఐలో అప్రెంటిస్ మేళా

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 11న జాతీయ స్థాయి అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాలోని పలు కంపెనీల బాధ్యులు పాల్గొని అప్రెంటిస్ షిప్ కోసం అభ్యర్థులను ఎంపిక చేస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్సెస్సీ, ఐటీఐ మెమోలు, కుల ధృవీకరణ, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

పాలేరుకు తగ్గిన వరద

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌కు రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలతో 3,275 క్యూసెక్కుల వరదనీరు చేరింది. అయితే, శుక్రవారానికి 2,176 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ప్రస్తుతం రిజర్వాయర్ నీటి మట్టం 22.65 అడుగులకు చేరగా జిల్లాలోని రెండో జోన్‌కు సాగు అవసరాలకు నీరు విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వకు 2,406 క్యూసెక్కులు, పాలేరు కాల్వకు 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోపక్క ఎడమకాల్వలో 2వేల క్యూసెక్కులకు మించి నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో మినీ హైడల్ ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టులోని ఒక యూనిట్ ద్వారా గంటకు 900 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

ఎంబీసీకి సాగర్ జలాలు



కప్పలబంధం రెగ్యులేటరీ వద్ద పూజలు నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు

కల్లూరు: వర్షాభావ పరిస్థితులతో వరి పంట ఎండిపోయే దశకు చేరడంతో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సాగర్ నీరు విడుదలకు చొరవ తీసుకున్నారు. ఈమేరకు శుక్రవారం మధిర బ్రాంచ్ కెనాల్(ఎంబీసీ)కు పాలేరు రిజర్వాయర్ నుంచి 600 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు. ఈ ప్రవాహం మరో 200 క్యూసెక్కుల మేర పెరిగే అవకాశముంది. కాగా, సాగర్ జలాలు నీరు శుక్రవారం కల్లూరు మండలానికి చేరడంతో కప్పలబంధం రెగ్యులేటరీ వద్ద ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పూజలు చేశారు. కాగా, నీటి విడుదలతో రెండో జోన్‌లోని సాగర్ ఆయకట్టులో వేసిన పంటలకు ప్రాణం వచ్చినట్లయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బీరవల్లి రఘు, సర్పంచ్ నందిగామ ప్రసాద్, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్‌తోపాటు డాక్టర్ లక్కినేని రఘు, పాలెపు రామారావు, కొరకొప్పు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బోణీ కొట్టాలనే లక్ష్యంతో బీజేపీ అధిష్టానం విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈమేరకు ప్రత్యేక దృష్టి సారించిన అధిష్టానం ఇతర రాష్ట్రాల నుంచి ఎమ్మెల్యేలను, కేంద్ర మంత్రులను తరచూ పంపుతూ నేతల్లో, కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ప్రయత్నాలు చేసింది. గత నెల 27న ఖమ్మంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరైన బహిరంగ సభను పార్టీ విజయవంతం చేసింది. భారీగానే జనం తరలిరావడంతో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. ఆ తర్వాత పార్టీలో పెద్దగా చేరికలు లేకపోవడం, ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు బలమైన అభ్యర్థుల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉండటం, ఎన్నికల సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ పార్టీని వీడడం వంటి కారణాలు పార్టీ కేడర్‌కు నీరసం తెప్పిస్తున్నాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

కమలం.. నీరసమే..

ఉమ్మడి జిల్లాలో సత్తా చాటాలని బీజేపీ ప్రణాళిక

- తరచుగా రాష్ట్రాల ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రుల రాక
- పార్టీ బలోపేతంపై నేతలు, కేడర్‌కు దిశానిర్దేశం
- అమిత్‌షా సభ విజయవంతమైనా చేరికలు లేక డీలా
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు పోటీనిచ్చే అభ్యర్థుల కోసం తర్జనభర్జన

చేరికల్లో వెనుకంజ

ఉమ్మడి జిల్లాలోని వివిధ పార్టీల నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు ఉంటాయని ఆ పార్టీ నేతలు భావించారు. కానీ ఆ స్థాయిలో చేరే వారు లేక బలం పుంజుకోలేకపోయింది. బీఆర్‌ఎస్ అసంతృప్త నేతలను బీజేపీలో చేర్చుకునేందుకు ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు జరిగాయి. నడ్డా, అమిత్‌షా ఆదేశాల మేరకు ఈటల రాజేందర్ పలుమార్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చలు జరిపినా ఫలితం రాలేదు. ప్రజాకర్షణ కలిగిన నేతలు లేకపోవడం ఉమ్మడి జిల్లాలో బీజేపీకి ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం టికెట్ల కోసం బీజేపీ దరఖాస్తులను ఆహ్వానిస్తే, పలువురు దరఖాస్తు చేసుకుంటున్నా బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు దీటైన అభ్యర్థులను బరిలో నిలపడం ఆ పార్టీకి కష్టంగా మారుతుందనే విశ్లేషణ జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాపై గురి..

బీజేపీ శ్రేణులు ఉమ్మడి జిల్లాపై పట్టు సాధించేందుకు నాలుగేళ్లుగా ప్రణాళికాయుతంగా పనిచేస్తున్నాయి. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒక్కో సీటుకే పరిమితం కావడంతో.. బీజేపీ పెద్దలు వ్యూహాత్మకంగా ఇక్కడ పాగా వేసేందుకు సిద్ధమయ్యారు. బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని చెబుతూ 'గులాబీ' వ్యతిరేక ఓటును తమ ఖాతాలో వేసుకోవాలనే ఉద్దేశంతో పావులు కదిపారు. ఈమేరకు స్థానికంగా పార్టీ నేతలు బీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందంటూ పలు సందర్భాల్లో ఆందోళనలు నిర్వహించారు. బీజేపీ అధ్యక్ష హోదాలో బండి సంజయ్ మే నెల ఖమ్మంలో నిర్వహించిన నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొన్నారు. పలుమార్లు ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తోపాటు పలువురు బీజేపీ అగ్రనేతలు సైతం జిల్లాలో పర్యటించారు. మరోవైపు ఇతర రాష్ట్రాల ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు కూడా తరచుగా వచ్చివెళ్తూ కార్యకర్తలతో సమావేశమై చాపకింద నీరులా పార్టీ బలోపేతానికి కృషిచేశారు.

అమిత్‌షా సభకు ఖమ్మం వేదిక

మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన సంపర్క్ అభియాన్ పేరుతో సభలు నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణలో నిర్వహించే సభల్లో మొదటగా ఖమ్మంను ఎంచుకున్నారు. అయితే, జూన్ 15నే ఈ సభ జరగాల్సి ఉన్నా తుపాను కారణంగా వాయిదా పడింది. ఈ సభను గత నెల 27న నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో నిర్వహించగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొనడంతో పాటు ప్రజలు భారీగా తరలిరావడంతో పార్టీ కేంద్ర, రాష్ట్రస్థాయి నేతలతోపాటు స్థానిక నేతలు ఆనందం వ్యక్తం చేశారు. ఖమ్మంలో బీజేపీ లేదనే వారికి ఇదే తమ సమాధానమని వెల్లడించారు. ఈ సభ విజయవంతంతో ఉమ్మడి జిల్లాలో బీజేపీ బలం పెరిగిందంటూ నేతలు చెప్పుకొచ్చారు.

క్షేత్రస్థాయిలో స్తబ్దత

నిన్నమొన్నటి వరకు కార్యక్రమాలు నిర్వహించిన బీజేపీ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాత్రం క్షేత్రస్థాయిలో డీలాగా కనిపిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌తోపాటు కమ్యూనిస్టులు కూడా కొంత మేరకు బలంగా ఉన్నారు. వీరిలో బీఆర్‌ఎస్ ముందుగానే తన అభ్యర్థులను ప్రకటించగా.. ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టారు. ఇక కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో పటిష్టంగా ఉండగా.. కొత్త నేతల చేరికలతో బలం పుంజుకుంది. బీఆర్‌ఎస్‌కు దీటుగా ఆ పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. బీజేపీ మాత్రం అమిత్‌షా సభ తర్వాత అదే రీతిలో ముందుకు వెళ్లలేకపోతోంది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో కేడర్‌కు దిశానిర్దేశం కరువు కాగా.. ముఖ్యనేతలు వచ్చినప్పుడు హడావుడి చేస్తూ, పార్టీ బలోపేతంపై సారించడం లేదనే చర్చ జరుగుతోంది.

రుణమాఫీ త్వరగా పూర్తిచేయండి



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే సండ్ర, ఎమ్మెల్సీ మధు తదితరులు

- మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రత్యేక సమీక్ష

ఖమ్మం సహకారనగర్: రైతుల పంట రుణాలకు సంబంధించి మాఫీని ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రుణమాఫీ చేపట్టిందన్నారు. జిల్లాలోని 3,41,023 మంది రైతులు అర్హులు కాగా, మొదటి విడతలో 20,891 మంది రైతులకు రూ.26.759 కోట్లు, రెండో విడతలో 19,443 మంది రైతులకు రూ.66.43 కోట్లు, మూడో విడతగా 53,222 మంది రైతులకు రూ 297.251 కోట్లమేర రుణమాఫీ చేసినట్లు తెలిపారు. అయితే, సాంకేతిక సమస్యలు ఉన్న రైతులకు జాబితా తీసుకొని వెంటనే పరిష్కరించాలని సూచించారు. అంతేకాకుండా ఆర్వోఎఫ్‌ఆర్ పట్టా అందిన రైతులకు పంట రుణాలు ఇప్పించడంపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో రైతులకు పంట రుణమాఫీ కావడం లేనందున సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడగా, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, డీఏఓ సరిత, డీసీఓ విజయకుమారి, జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీకి రూ.100 కోట్ల నిధులు

- పువ్వాడకు ఉత్తర్వులు అందజేసిన మంత్రి కేటీఆర్



మంత్రి పువ్వాడకు ఉత్తర్వులు అందజేస్తున్న మంత్రి కేటీఆర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో అభివృద్ధి పనులకు గాను ప్రభుత్వం మరోమారు నిధులు విడుదల చేసింది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అభ్యర్థన మేరకు టీయూఎఫ్‌ఐడీసీ(తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ.100 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేయగా... ఉత్తర్వుల కాపీని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు మంత్రి కేటీఆర్ శుక్రవారం హైదరాబాద్‌లో అందజేశారు. అనంతరం మంత్రిగా నాలుగేళ్ల కాలం పూర్తి చేసుకున్నందుకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ ఖమ్మం అభివృద్ధికి మరో రూ.100 కోట్లు ఇవ్వడంపై ప్రజల తరఫున కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతికి తప్ప దేనికీ భయపడను..



లైసెన్సులను అందజేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత తదితరులు

ఖమ్మంవ్యవసాయం: 'నేను దేనికీ భయపడను.. కానీ అవినీతికి భయపడుతా.. కొందరు ఎచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతారు. స్థాయి మరిచి అబద్ధాలు ప్రచారం చేస్తారు.. కానీ ప్రజలకు అన్నీ తెలుసు' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం మార్కెట్‌లో అడ్తిదారులకు శుక్రవారం ఆయన లైసెన్సుల పంపిణీ చేశారు. తొలుత త్రీటౌన్‌లోని మూడు బొమ్మల సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించగా మంత్రిగా నాలుగేళ్ల పదవీకాలం పూర్తికావడంతో ఖమ్మం మార్కెట్ కమిటీ ఆధ్వర్యాన మంత్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పువ్వాడ మాట్లాడుతూ అర్హులైకు మాత్రమే నిబంధనలకు అనుగుణంగా లైసెన్సులు ఇచ్చారని చెప్పారు. మార్కెట్ మాజీ చైర్మన్ గుండాల కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రస్తుత చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, మేయర్ నీరజ, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలన మొదలైంది...

- ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ పూర్తి
- 3,876 దరఖాస్తుల్లో 59 తిరస్కరణ



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రక్రియ వేగవంతంగా జరుగుతోంది. ఈ నెల 3వ తేది నుంచి 5వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో అధికారులు డీఈఓ సోమశేఖరశర్మ ఆధ్వర్యాన పరిశీలన ప్రారంభించారు. ఈక్రమాన ఉపాధ్యాయులు తమ దరఖాస్తుల వివరాలు తెలుసుకునేందుకు కార్యాలయానికి బారులు దీరుతున్నారు.

97 పెండింగ్...

బదిలీలకు ఎవరు అర్హులనే విషయమై విద్యాశాఖాధికారులు అవగాహన కల్పించారు. ఈమేరకు మొత్తం 3,876 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందగా, 3,720దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి అప్రూవ్ చేశారు. ఇక 97 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచగా, 59 తిరస్కరించారు. బదిలీకి కనీసం రెండేళ్ల సర్వీస్ ఉండాలనే నిబంధన విధించినా, తక్కువ సర్వీస్ ఉన్న వారు సైతం దరఖాస్తు చేయడంతో తిరస్కరించినట్లు చెబుతున్నారు.

చకచకా పరిశీలన

విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉద్యోగులు బదిలీల కోసం అందిన దరఖాస్తులు, వారి సర్వీస్ రిజిస్టర్లను పరిశీలిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల జాబితాను ఆర్‌జేడీ, స్కూల్ అసిస్టెంట్ల జాబితాను డీఈఓ విడుదల చేశారు. వీటితో పాటు కార్యాలయంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ దరఖాస్తులను గుర్తించే ప్రక్రియపై కసరత్తు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం వరకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ దరఖాస్తుల వివరాలు వెల్లడించే అవకాశముంది. ఇందుకోసం గతంలోనే స్పౌజ్ వాడుకున్న వారు, నిబంధనలకు అనుకూలంగా, విరుద్ధంగా ఉన్న వాటిని గుర్తించే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. దరఖాస్తుల పరిశీలనను డీఈఓ సోమశేఖరశర్మ పర్యవేక్షిస్తుండగా, సూపరింటెండెంట్ సీ.హెచ్.శ్రీనివాసరావు, జీ.ఎస్. ప్రసాదరావు, ఏపీఓ శ్రీనివాసరావు, ఏఎస్‌ఓ కిషోర్‌కుమార్, దేవేందర్, నందకిషోర్, వై.శ్రీనివాసరావు, నగేష్, హెచ్‌ఎంలు శంకర్‌రావు, అజిత, శైలజ, లక్ష్మి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు లోక్ అదాలత్

- జిల్లాలోని కోర్టుల్లో 11 బెంచ్‌లు ఏర్పాటు
- ఇప్పటికే ముందస్తు లోక్ అదాలత్‌లు
- 2 వేలకు పైగా క్రిమినల్ కేసులు పరిష్కారం



ముందస్తు లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు (ఫైల్)

ఖమ్మంలీగల్: జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించనుండగా, జిల్లా కోర్టుతోపాటు జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాజీపడదగిన కేసుల పరిష్కారం కోసం నిర్వహించే లోక్ అదాలత్‌లు కక్షిదారులకు ఉపయోగపడుతున్నాయి. కేసుల పరిష్కారం కోసం జిల్లావ్యాప్తంగా 11 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. కాగా, ఈనెల 1వ తేదీ నుంచి కేసుల పరిష్కార ప్రక్రియ ప్రారంభం కాగా.. 2వ తేదీన ముందస్తు లోక్ అదాలత్ నిర్వహించారు. ఇప్పటి వరకు ముందస్తు లోక్ అదాలత్‌ల ద్వారా దాదాపు రెండు వేల క్రిమినల్ కేసులు పరిష్కరించారు. ఇక శనివారం నాటి జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు.

సామరస్య పరిష్కారం కోసం..

పేదలకు న్యాయసాయం అందించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు, కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజల కేసులను రాజీమార్గం ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తారు. ప్రభుత్వం 1987లో న్యాయసేవాధికార చట్టం తీసుకొచ్చింది. డబ్బు ఉన్న వారికే న్యాయం సొంతమనే అపోహను తొలగించేందుకు రాజ్యాంగం ప్రసాదించిన 39వ అధికరణం ద్వారా పార్లమెంట్ ఈ న్యాయసేవాధికార చట్టాన్ని ప్రవేశపెట్టింది. ప్రతీ మనిషికి సాంఘిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం అందించడం ఈ సంస్థ లక్ష్యం. ఇక ప్రత్యామ్నాయ పరిష్కార పద్ధతి అనే సూత్రాన్ని అనుసరించి లోక్‌అదాలత్‌లను ప్రవేశపెట్టారు.

ముందుగానే సన్నద్ధం

లోక్ అదాలత్‌ను పురస్కరించుకుని ఈనెల 1వ తేదీ నుంచి పరిష్కార ప్రక్రియ ప్రారంభించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు 2వ తేదీన ముందస్తు లోక్ అదాలత్ నిర్వహించగా, రెండు వేలకు పైగా క్రిమినల్ కేసులు ఇప్పటి వరకు పరిష్కారమయ్యాయి. పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, బీమా కంపెనీలు, ఇతర ఆర్థిక సంస్థల ప్రతినిధులతో న్యాయమూర్తులు దశల వారీగా సమావేశాలు నిర్వహించి లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా సమాయత్తం చేశారు. తొలిదశలో జిల్లా జడ్జి బీ.ఎస్.జగ్జీవన్ కుమార్ విస్తృత సమావేశాలు నిర్వహించగా.. ఆయన సెలవులో ఉండటంతో మొదటి అదనపు జిల్లా జడ్జి కె.ఉమాదేవి సమావేశాలు కొనసాగించారు. ఇక న్యాయసేవాసంస్థ న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా సమన్వయం చేయగా, సెలవు దినాల్లోనూ ముందస్తు లోక్‌అదాలత్‌లు నిర్వహించి అత్యధిక కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులు కృషి చేశారు.

అంతకు మించి..

గత జూన్‌లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 7,880 కేసులు పరిష్కరించారు. ఈసారి అంతకన్నా ఎక్కువగా కేసుల పరిష్కారంపై దృష్టి సారించారు. శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 11 బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మంలో ఏడు, సత్తుపల్లిలో మూడు, మధిరలో ఒక బెంచ్ ఏర్పాటుచేస్తుండగా, రాజీ పడదగిన క్రిమినల్, కుటుంబ తగాదా కేసులు, ఆస్తి దావాలు, చెల్లని చెక్కు కేసులు, విద్యుత్ చౌర్యం కేసులతో పాటు పిటీ కేసులు పరిష్కరించనున్నారు. లోక్ అదాలత్‌కు సహకరించాల్సిందిగా న్యాయవాదులు, పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఇతర సంబంధీకులకు ఇప్పటికే న్యాయసేవా సంస్థ నుంచి సమాచారం ఇచ్చారు.







క్లుప్తంగా

ఇంద్రకీలాద్రిపై సండ్ర దంపతుల పూజలు


ఆలయంలో ఎమ్మెల్యే సండ్ర దంపతులు

సత్తుపల్లి: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించగా, ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కందుకూరులో విజృంభిస్తున్న జ్వరాలు


డ్రెయినేజీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ మాలతి

వేంసూరు: మండలంలోని కందుకూరులో పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామంలో దాదాపు ఇరవై మందికి పైగా డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం. స్థానిక వైద్యులు మూడు రోజులుగా గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తుండగా ఎంపీ బండి పార్థసారధిరెడ్డి ఉచితంగా మందులు సమకూర్చారు. అయితే, జ్వర బాధితుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో డీఎంహెచ్ఓ మాలతి శుక్రవారం కందుకూరులో పర్యటించారు. ఈసందర్భంగా దోమల నివారణపై సిబ్బందికి సూచనలు చేసిన ఆమె, జ్వరాల బారిన పడకుండా స్థానికులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం, ఎంపీడీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఖమ్మం సహకారనగర్: సంక్షేమం, సుపరిపాలన కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని లకారం ట్యాంక్ బండ్‌పై శుక్రవారం సాయంత్రం 'వాకర్లతో కాంగ్రెస్ మాటముచ్చట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అధికారం ఇస్తే కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమ పథకాలు అమలుచేస్తామిన తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు అహ్మద్ జహాన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ నేతల రాక

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ శనివారం ఖమ్మం రానున్నారు. ఈ విషయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు వైరాలో జరిగే నియోజకవర్గ స్థాయి సమ్మేళనంలో పాల్గొంటారని వెల్లడించారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్‌లోకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కర్నె లింగయ్య(65) గురువారం పాలేరు రిజర్వాయర్‌లోకి చేపల వేటకు వెళ్లాడు. ఈక్రమంలో తెప్పపై నుండి నీటిలో పడిపోగా ఆయన కాళ్లకు వల చిక్కుకుంది. దీంతో ఆయన నీట మునుగిపోతుండగా ఇతర మత్స్యకారులు బయటకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లింగయ్య గురువారం రాత్రి మృతి చెందగా, ఆయన కుటుంబీకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ.3లక్షల రుణం పేరిట రూ.లక్షకు టోకరా

కల్లూరురూరల్: రుణం ఇస్తామని ఫోన్ చేసి నమ్మబలికిన వ్యక్తులు రూ.1.11లక్షలు డిపాజిట్ చేయించుకుని ఆతర్వాత మోసం చేసిన ఘటన ఇది. కల్లూరు మండలం చంద్రుపట్లకు ఇనుపనూరి శ్రీనివాసరావుకు గతనెల 28న రూ.3 లక్షలు రుణం మంజూరైందని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. తొలుత డాక్యుమెంట్ ఖర్చుల నిమిత్తం రూ.1.11లక్షలు ఫోన్ పే ద్వారా చెల్లించాలని సూచించగా ఆయన పంపించాడు. అయితే, ఇప్పటివరకు రుణం అకౌంట్‌లో జమ కాకపోగా, గతంలో ఫోన్ చేసిన వ్యక్తిని సంప్రదించేందుకు ప్రయత్నిస్తే ఆయన నంబర్ పనిచేయలేదు. దీంతో మోసపోయానని గుర్తించిన శ్రీనివాసరావు శుక్రవారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

పలుకుబడుల భాష మనదే..





- అణచివేతకు గురైన యాస.. తెలంగాణ తెలుగు
- విమర్శకులను అడ్డుకున్న కాళోజీ, సాహితీవేత్తలు

నేడు కాళోజీ జయంతి.. తెలంగాణ భాషా దినోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: ఆది నుంచి తెలంగాణ యాసను విమర్శించే వారికి కాళోజీ దీటైన బదులిచ్చేవారు. ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావును తెలంగాణ తొలిపొద్దుగా కీర్తిస్తారు. తెలంగాణ రచయిత కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈమేరకు శనివారం ఖమ్మం జిల్లాలోనూ భాషా చైతన్య కార్యక్రమాలను నిర్వహించనున్నారు. పాఠశాల విద్యార్థులకు తెలంగాణ భాషపై ఉపన్యాస, వ్యాసరచన పోటలు జరగనున్నాయి. కాగా, తెలంగాణ భాషపై అంతులేని ప్రేమ కనబరిచిన కాళోజీ పండితులకు అర్థమయ్యేలాగే కాకుండా సామాన్యుల భాషలోనూ రచనలు చేశారు. తెలుగు భాష ఒక్కటైనా అనేక మాండలికాలు ఉన్నాయి. ఇందులో తెలంగాణ యాస వినసొంపుగా ఉంటుంది. నిజాం పాలనలో ఉర్దూ కలగలిసిన తెలంగాణ ప్రజల యాసను కొందరు గేలి చేయగా.. తెలంగాణ సాహితీవేత్తలు వ్యతిరేకించారు. వీరిలో కాళోజీ నారాయణరావు ముందు వరుసలో నిలుస్తారు. అందుకే ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

యాస.. బహు ప్రాచుర్యం

తెలుగు భాషలోని యాసల్లో తెలంగాణ యాస ఒకటి. తెలంగాణతో పాటు ఇతర ప్రదేశాల్లో కూడా ఈ యాస ఉపయోగంలో ఉండగా.. ఎక్కువగా హైదరబాదీ ఉర్దూ ప్రభావం కనిపిస్తుంది. తెలంగాణ యాసకు ఉన్న ఈ ప్రత్యేక శైలితో బహు ప్రాచుర్యం పొందింది. తెలుగు సినిమాల్లో గతంలో విలన్లు, కమెడియన్లతోనే ఈ యాస పలికించగా.. ఇప్పుడు ప్రధాన భాషగా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈమేరకు శనివారం తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భాష కమ్మదనంపై జిల్లాకు చెందిన కవులు, సాహితీవేత్తల అభిప్రాయాలు.

సంస్కృతి, సంప్రదాయాల చిహ్నం..



తెలంగాణ భాష, యాస ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నంగా నిలుస్తోంది. ప్రజల గుండెగోస, యాసను అక్షరబద్ధం చేసి సాహిత్యానికి పట్టాభిషేకం చేశారు కాళోజీ. ఆయన పేరిట తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉంది.

– అట్లూరి వెంకటరమణ, కవి, రచయిత

తెలంగాణ మాండలికానికి గుర్తింపు



ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక మాండలికానికి ప్రభుత్వం గుర్తింపు నిచ్చింది. తెలంగాణ బాష, యాసకు పట్టం కట్టి మాధుర్యాన్ని రుచి చూసేలా పాఠ్యాంశాల్లో చేర్చారు. తెలుగు వాచకాల్లోని పాఠ్యాంశాలను మాండలికంలో ఇవ్వడం సంతోషంగా అనిపిస్తుంది.

– పురిమళ్ల సునంద, తెలుగు ఉపాధ్యాయురాలు

వివక్షను ఎదురించారు..



ఎక్కడైనా అన్యాయాన్ని ఎదురించినోడు కాళోజీకి ఆరాధ్యుడు. సామాజికంగా, భాషా పరంగా వివక్ష చూపిస్తే కాళోజీ గొడవపడి ఎదురించేవారు. పలుకుల భాషలో కంటే పలుకుబడుల భాషలోనే మన బతుకు ఉన్నదని ఆయన అప్పట్లోనే చాటారు.

– కొల్లు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు, ఖమ్మం

అస్తిత్వం, భాష కోసం తపన



తెలంగాణ అస్తిత్వం, తెలుగు భాష ఊపిరి కోసం తపించిన ధీరుడు కాళోజీ. పుట్టుక, చావు కాకుండా బ్రతుకుంతా తెలంగాణకు ఇచ్చిన చలనశీలుడు, చైతన్యకారుడు. జనం భాష తెలుగుకు జై కొట్టిన కాళోజీ జయంతిని ఘనంగా జరుపుకోవాలి.

– గాజుల భారతి శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే...

'గడప గడపకు కాంగ్రెస్'లో మువ్వా విజయ్‌బాబు


ర్యాలీలో పాల్గొన్న విజయ్‌బాబు, నాయకులు

రఘునాథపాలెం: ప్రస్తుత పాలకుల తీరుతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తెలిపారు. 'గడప గడపకు కాంగ్రెస్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన రఘునాథపాలెం మండలంలోని కే.వీ.బంజర, మూలగూడెం, మంగ్యా తండా గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్‌లోకి అధికారంలోకి రాగానే రూ.500 గ్యాస్ సిలిండర్, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వడంతో పాటు రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నింటికీ కచ్చితంగా అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో ఉందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతర్లపాడు వాసికి అరుదైన గౌరవం

శ్రీనివాస్‌కు కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్


కనమర్లపూడి శ్రీనివాస్

తిరుమలాయపాలెం: మండలంలోని పాతర్లపాడుకు చెందిన కనమర్లపూడి శ్రీనివాస్‌కి కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ లభించింది. గ్రామానికి చెందిన కనమర్లపూడి నర్సయ్య, సత్యవతి దంపతుల కుమారుడైన శ్రీనివాస్ పేదరికంలో ఉన్నా చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఇళ్లలో ట్యూషన్లు చెబుతూ, టైలరింగ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేసిన ఆయన మరిపెడ, మహబూబాబాద్‌ల్లోని ప్రైవేట్ కళాశాలల్లో పనిచేశాక గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లిష్‌పై భయాన్ని పోగొట్టేలా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. అలాగే, యూట్యూబ్ చానల్ ద్వారా పాఠాలు బోధిస్తుండడంతో శ్రీనివాస్ సేవలను గుర్తించిన కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఈసందర్భంగా ఆయనను సర్పంచ్ తమిర రామ్మోహన్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సరస్వతిభట్ల సీతారామయ్య, తదితరులు అభినందించారు.

బెటాలియన్ నుంచి 25మంది కానిస్టేబుళ్ల బదిలీ


కానిస్టేబుళ్లతో కమాండెంట్ వెంకటరాములు, తదితరులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌కు చెందిన 25మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. వివిధ జిల్లాలకు వీరిని బదిలీ చేయగా, బెటాలియన్ ప్రాంగణంలో కమాండెంట్ పి.వెంకటరాములు ఆధ్వర్యాన సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ సిబ్బంది నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి బెటాలియన్‌కు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. సహాయ దళాధిపతులు ఎం.ఉదయ్‌భాస్కర్, ఎం.శ్రీనివాసరావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వసతిగృహాలపై ప్రత్యేక పర్యవేక్షణ

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మంమయూరిసెంటర్: సంక్షేమ శాఖల పాఠశాలలు, వసతి గృహాల్లో మెనూ పటిష్టంగా అమలయ్యేలా వసతి గృహాల అధికారులు పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన బీసీ, సీ్సీ, ఎస్టీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లు, వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్లు, ఆర్సీఓలు, ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ హాస్టల్‌లో మెనూ చార్ట్‌ను ఏర్పాటుచేసి పాటించాలని ఆదేశించారు. వసతిగృహాల్లోని వంటగది, డార్మెటరీలు, మరుగుదొడ్లు, పరిసరాలలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. తరచుగా విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయించాలని, చదువులోనే ముందు నిలిచేలా ప్రత్యేక తరగతులునిర్వహించాలని సూచించారు. ఎవరైనా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖాధికారి జి.జ్యోతి, ఆర్సీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రూ.17 లక్షల గంజాయి పట్టివేత


కారులో పట్టుబడిన గంజాయితో ఎస్సై ప్రసాద్, సిబ్బంది

వైరారూరల్: మహారాష్ట్రకు తరలిస్తున్న రూ.17 లక్షల విలువైన గంజాయిని శుక్రవారం వైరా పోలీసులు స్వాధీనం చేసుకున్న కారులో తరలిస్తున్న 87 కేజీల గంజాయితో పాటు రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యాన ఏపీ, తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన వైరా మండలంలోని గన్నవరం, దాచాపురం క్రాస్‌రోడ్డులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఇక్కడ వైరా ఎస్సై మేడా ప్రసాద్ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీలోని నెమలి నుండి వైరా వైపు వస్తున్న కారును పరిశీలించారు. కారు డిక్కీలో 87 కేజీల గంజాయి లభించగా, మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు గుర్తించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఇదే కారు వెనుకాల వస్తున్న మరో కారులోనూ 25 కేజీల గంజాయిని రవాణా చేస్తుండగా, తనిఖీ విషయం తెలుసుకున్న వారు మరో దారిలో పరారయ్యారు. అందులో ముగ్గురు నిందితులు ఉన్నట్లు పోలీసులు ధృవీకరించారు. కాగా, పోలీసుల అదుపులోకి తీసుకున్న వారిని సూరార్యపేట జిల్లా లాల్‌సింగ్ తండాకు చెందిన ఆంగోతు నాగరాజు, ధరావత్ కృష్ణగా గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నూనావత్ సాగర్ తెలిపారు. కాగా, గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎస్సై మేడా ప్రసాద్, సిబ్బందిని ఏసీపీ ఎం.ఏ.రెహమాన్‌తో పాటు సీఐ అభినందించారు.

'బీఆర్ఎస్ శ్రేణులకే ప్రభుత్వ పథకాలు'


ధర్నాలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ పథకాలన్ని బీఆర్ఎస్ నేతలకే అందుతుండడంతో ఆ పార్టీ పథకాలుగా మారుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. అర్హులందరికీ గృహలక్ష్మి వర్తింపచేయడంతో పాటు ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలనే డిమాండ్‌తో ఖమ్మం అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నున్నా మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యాన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటిస్తున్న పథకాలన్నీ తమ కార్యకర్తల కోసమే అన్నట్లుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఫలితంగా అర్హులకు లబ్ధి జరగడం లేదని తెలిపారు. ఇక కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక సామాన్యులు బతికే పరిస్థితి లేకపోగా, కార్పొరేట్లకు లాభం జరుగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు యర్రా శ్రీకాంత్, శ్రీనివాస్, రమ్య, తిరుపతిరావు, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీను, బత్తిన ఉపేందర్, నాగసులోచన, కార్పొరేటర్ వెల్లంపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు ఆఫీసర్ మృతిపై సంతాపం

ఖమ్మంక్రైం: హోంగార్డులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతున్న హైదరాబాద్ ట్రాఫిక్ హోంగార్డ్ ఆఫీసర్ మంత్రి రవీందర్ మృతి చెందగా జిల్లా హోంగార్డ్ ఆఫీసర్ల తరఫున సంతాపం ప్రకటించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రవీందర్ చిత్రపటం వద్ద నివాళులర్పించాక జిల్లా హోంగార్డు ఆఫీసర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ రఫీ మాట్లాడారు. ఉపాధ్యక్షుడు బంక శ్రీనుతో పాటు విజయకుమార్, వెంకటేశ్వర్లు, వెంకన్న, రమేష్, రహీం, రవి, రామకృష్ణ, మస్తాన్, కవిత, ఇందిరాజ్యోతి, ఆరిఫా, రూప, పార్వతి, నాగరాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

డెంగీతో విద్యార్థిని మృతి


హైమావతి (ఫైల్)

మధిర: మూడు రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతూ మండలంలోని మడుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని హైమావతి(17) శుక్రవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన తాటికొండ చిరంజీవి సైకిల్ మెకానిక్‌గా, ఆయన భార్య లక్ష్మి ఓ వస్త్ర దుకాణంలో గుమస్తాగా పనిచేస్తోంది. వీరి కుమార్తె హైమావతి మధిరలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా ఈనెల 5న తీవ్ర జ్వరం వచ్చింది. ఆమెను పరీక్షించిన ఆర్ఎంపీ సూచనలతో ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు విజయవాడలోని ఇంకో ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా డెంగీకి తోడు కామెర్లు రావడం, ప్లేట్‌లెట్లు పడిపోవడంతో శుక్రవారం మృతి చెందింది. కాగా, కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తుండగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి, కౌన్సిలర్ మేడికొండ కళ్యాణి కిరణ్ సంతాపం తెలిపారు. మండలంలో డెంగీ జ్వరాలు వ్యాపిస్తున్న నేపథ్యాన అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

11, 12వ తేదీల్లో విద్యుత్ ఉద్యోగుల దీక్షలు


డీఈకి నోటీసు ఇస్తున్న 327 యూనియన్ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: సుదీర్ఘ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 11, 12వ తేదీల్లో ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయాల ఎదుట రిలే దీక్షలు చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327 యూనియన్) జిల్లా ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఆపరేషన్ కార్యాలయంలో టెక్నికల్ డీఈ బాబూరావుకు నోటీసు అందజేశారు. రాష్ట్రంలోని అన్ని సర్కిల్ కార్యాలయాల ఎదుట దీక్షలు చేపడుతామని, విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందపాటి సత్యనారాయణరెడ్డి, సీతారాం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మంగళ, శుక్రవారం.. డ్రై డే

- జ్వర బాధితులను గుర్తించేందుకు విస్తృతంగా సర్వే
- పువ్వాడ నగర్‌లో పర్యటించిన కలెక్టర్ గౌతమ్


జ్వరాల నియంత్రణపై వైద్యాధికారికి సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

రఘునాథపాలెం: ప్రతీ మంగళ, శుక్రవారం తప్పనిసరి డ్రై డే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్‌నగర్‌లో శుక్రవారం పర్యటించిన ఆయన డెంగీ దోమల నియంత్రణ, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటితో ఎదురయ్యే అనర్థాలను వివరించారు. ఇంట్లోనే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇటీవల గ్రామంలో డెంగీ బారిన పడిన వారికి చేసిన చికిత్సపై డాక్టర్ సంధ్యారాణితో ఆరా తీశారు. ఎవరికైనా డెంగీ సోకితే ఆ ఇంట్లోని వారికే కాకుండా చుట్టుపక్కల ఇళ్లలోని వారి రక్తనమూనాలు కూడా సేకరించి పరీక్షలు చేయాలని, వ్యాధి విజృంభించకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీపీఓ వీ.వీ.అప్పారావు, జిల్లా మలేరియా అధికారి లక్ష్మీనారాయణ, డీఎల్పీఓ పుల్లారావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాస రెడ్డి, సర్పంచ్ కె.లలితరవి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో ఏర్పాటుచేసిన మోడల్ సీఎస్సీ కేంద్రాన్ని కలెక్టర్ గౌతమ్ ప్రారంభించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 100 గ్రామాలను డిజిటల్ గ్రామాలుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఈడీఎం దుర్గాప్రసాద్, మోడల్ సీఎస్సీ స్టేట్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ బేతోజు హరికృష్ణకుమార్, జిల్లా మేనేజర్ సురేష్‌తో పాటు యరగర్ల హన్మంతరావు, రావెళ్ల మాధవి, దారా శ్యాంకుమార్, నాగవాణి, సునీల్ పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ ఓటుహక్కు

ఖమ్మంసహకారనగర్: ఓటరుగా నమోదు కోసం ఈనెల 19వ తేదీ వరకు గడువు ఉన్నందున అర్హుందరూ నమోదు చేసుకునేలా పార్టీల నాయకులు అవగాహన కల్పించాలని కలెక్టర్ గౌతమ్ కోరారు. కలెక్టరేట్‌లో వివిధ పార్టీల నాయకులతో శుక్రవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈమేరకు అర్హులందరూ ఓటుహక్కు పొందేలా చూడాలని, గతంలో వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు వచ్చే సిబ్బందికి సహకరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ డీటీ అన్సారీతో పాటు వివిధ పార్టీల నాయకులు ఎన్.తిరుమలరావు, పి.శ్రీనివాస్, పి.వెంకటేశ్వరరావు, ఎస్.సత్యంబాబు, ఎల్.సతీష్, కె.కరుణాకర్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

15న ఆ 9 చోట్ల భారీ ర్యాలీలు

కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం సందర్భంగా వేలాదిమందితో ప్రదర్శనలు: మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15న ఏకకాలంలో తొమ్మిది జిల్లాల్లో కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా జిల్లా కేంద్రాల్లో కనీసం 15వేల నుంచి 20వేల మందితో భారీ ర్యాలీలు నిర్వహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం నేపథ్యంలో శుక్రవారం మంత్రులు, ఎమ్మెల్యేలతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 15న జనగామ, నిర్మల్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, వికారాబాద్, ఖమ్మం జిల్లాలలో కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతున్నాయని వెల్లడించారు. సీఎం కేసీఆర్ 15న ఏదో ఒక చోట కొత్త మెడికల్ కాలేజీని ప్రారంభిస్తారని, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కామారెడ్డిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని కేటీఆర్ తెలిపారు. దేశంలో జిల్లాకో మెడికల్ కాలేజీ ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోందన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లను కలిగి ఉన్న రాష్ట్రంగా తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు.

ఎస్ఈసీగా పార్థసారథి పదవీకాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా సి.పార్థసారథి పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి శుక్రవారం (సెప్టెంబర్ 8)తో ఆయన మూడేళ్ల పదవీకాలం ముగియడంతో, ఆ రోజు నుంచే మరో ఏడాది ఎస్ఈసీగా కొనసాగిస్తూ సుల్తానియా ఆదేశాలిచ్చారు.


ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నరోత్తమ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కులాల సహకార అభి వృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన ఏర్పుల నరోత్తమ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి హరీశ్ నియామక ఉత్తర్వులను నరోత్తమ్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు.. నరోత్తమ్ ధన్యవాదాలు తెలిపారు.

రోగాలను బట్టి పీజీ మెడికల్ సీట్లు!

ఆయా ప్రాంతాల్లో సంబంధిత స్పెషాలిటీలో ఓపీ మేరకు సీట్లు మంజూరు

- ఔట్ పేషెంట్ల సంఖ్య 50కి తగ్గకుండా ఉంటే రెండు ఎండీ లేదా ఎంఎస్ సీట్ల కేటాయింపు
- వారానికి 20 ప్రసవాలున్న కాలేజీకి రెండు గైనిక్ స్పెషాలిటీ సీట్లు
- జాతీయ మెడికల్ కమిషన్ కీలక నిర్ణయం.. ముసాయిదా విడుదల
- ఎండీలో కొత్తగా ప్రజారోగ్యం, బయో ఫిజిక్స్, లేబొరేటరీ మెడిసిన్
- కొత్తగా అందుబాటులోకి 11 పోస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోర్సులు



సాక్షి, హైదరాబాద్: ఆయా ప్రాంతాల్లో వ్యాధులు.. రోగుల సంఖ్య..అందుతున్న వైద్య సేవలను బట్టి మెడికల్ కాలేజీలకు పీజీ సీట్లు కేటాయించాలని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) నిర్ణయించింది. అంటే ఏ ప్రాంతంలో ఎలాంటి రోగాలున్నాయో, ఆయా ప్రాంతాల్లోని మెడికల్ కాలేజీలకు ఆయా స్పెషాలిటీల్లో పీజీ మెడికల్ సీట్లు వచ్చే అవకాశం ఉంటుందన్నమాట. ఈ మేరకు కొత్త పీజీ మెడికల్ ముసాయిదాను విడుదల చేసింది. దీని ప్రకారం.. మెడికల్ కాలేజీలో సంబంధిత స్పెషాలిటీ వైద్యంలో ఔట్ పేషెంట్ (ఓపీ)ల సంఖ్య 50కి తగ్గకుండా ఉంటేనే రెండు ఎండీ లేదా ఎంఎస్ సీట్లను ఎన్ఎంసీ మంజూరు చేస్తుంది. ఉదాహరణకు ఒక మెడికల్ కాలేజీకి రెండు పీడియాట్రిక్ సీట్లు కావాలంటే సంబంధిత కాలేజీలో రోజుకు చిన్న పిల్లల ఓపీ కనీసం 50 ఉండాలి. ఒక ఆపరేషన్ థియేటర్ 24 గంటలు పనిచేస్తేనే రెండు పీజీ అనస్తీషియా సీట్లు ఇస్తారు. వారానికి 20 ప్రసవాలు జరిగితేనే రెండు గైనిక్ సీట్లు ఇస్తారు. ఇక సంబంధిత స్పెషాలిటీలో అదనంగా మరో సీటు కావాలంటే 20 శాతం ఓపీ పెరగాలి. సూపర్ స్పెషాలిటీకి సంబంధించి రెండు సీట్లుకేటాయించాలంటే ఆయా సూపర్ స్పెషాలిటీ విభాగంలో రోజుకు 25 ఓపీ ఉండాలి.

పడకల్లో 75% ఆక్యుపెన్సీ ఉండాలి

ఎన్ఎంసీ మరికొన్ని కొత్త నిబంధనలను కూడా ముసాయిదాలో చేర్చింది. మెడికల్ కాలేజీల్లోని స్పెషాలిటీ పడకల్లో 75 శాతం ఆక్యుపెన్సీ ఉండాలి. అల్ట్రాసౌండ్‌లు రోజుకు 30 జరగాలి. 10 సీటీ స్కాన్లు చేయాలి. రోజుకు మూడు ఎంఆర్ఐ స్కాన్లు తీయాలి. రోజుకు 15 శాతం మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి. గతంలో ఇలాంటి నిబంధనలు లేవు. సంబంధిత స్పెషాలిటీలో నిర్దీత ఓపీ సంఖ్యతో సంబంధం లేకుండా మౌలిక సదుపాయాలు, సర్జరీలు, అన్ని రకాల ఓపీలు, ఐపీలు, బ్లడ్ బ్యాంకు నిర్వహణ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలు ఉన్నాయా లేవా? వంటివి మాత్రమే చూసి సీట్లు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రధానంగా ఓపీని ప్రామాణికంగా తీసుకొని ఇవ్వాలని నిర్ణయించారు.

ఐసీఎంఆర్ ఆన్‌లైన్ కోర్సులు చదవాలి

ఎండీలో కొత్తగా 3 కోర్సులను ఎన్ఎంసీ చేర్చింది. ప్రజా రోగ్యం, బయో ఫిజిక్స్, లేబొరేటరీ మెడిసిన్‌లను ప్రవేశపెట్టింది. అలాగే సూపర్ స్పెషాలిటీలో ఉండే చిన్న పిల్లల గుండె, రక్తనాళాల కోర్సులను ఎత్తివేసి, సాధారణ గుండె, ఛాతీ, రక్తనాళాల సర్జరీలో చేర్చింది. సూపర్ స్పెషాలిటీలో ఉన్న ఛాతీ శస్త్రచికిత్స కోర్సును ఎత్తివేసి సాధారణ గుండె శస్త్రచికిత్సలో కలిపేసింది. అలాగే 11 పోస్ట్ డాక్టర్ సర్టిఫికెట్ కోర్సులు ప్రవేశ పెట్టింది. అవయవ మార్పిడి అనస్తీషియా, పీడియాట్రిక్ ఎండోక్రైనాలజీ, లేబొరేటరీ ఇమ్యునాలజీ, న్యూక్లియర్ నెఫ్రాలజీ, రీనాల్ పేథాలజీ, గ్యాస్ట్రో రేడియాలజీ, రక్తమార్పిడి థెరపీ, పెయిన్ మేనేజ్‌మెంట్, హిమటో ఆంకాలజీ, పీడియాట్రిక్ ఈ ఎన్‌టీ, స్పైన్ సర్జరీ కోర్సులు ప్రవేశపెట్టారు. పీజీ అయిపోయిన వా రు ఈ కోర్సులను చేసే సదుపాయం కల్పించారు. ఇక పీజీ చేసే ప్రతి విద్యార్థి మొదటి ఏడాది ఐసీఎంఆర్ నిర్వహించే ఆన్‌లైన్ కోర్సులు తప్పనిసరిగా చదవాలి. ఈ ముసాయిదాలోని అంశాలపై అభ్యంతరాలను 15వ తేదీలోగా తెలియజేయాలని ఎన్ఎంసీ కోరింది.

ఇలా అయితేనే ఉపయోగం

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు దాదాపు అన్ని జిల్లాలకు విస్తరించాయి. అందువల్ల ఆయా మెడికల్ కాలేజీల్లో పీజీ మెడికల్ సీట్లను స్థానిక రోగాలను బట్టి కేటా యిస్తేనే ఉపయోగం ఉంటుంది. ఎన్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో శాస్త్రీయ మైనది. ఆయా ప్రాంతాల రోగులకు సంబంధిత వైద్యం అందుబాటులోకి వస్తుంది.

- డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

కేటీఆర్‌తో ఎమ్మెల్యే చెన్నమనేని భేటీ

సాక్షి, హైదరాబాద్: వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ శుక్రవారం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో భేటీ అయ్యారు. గత నెల 21న ప్రకటించిన బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో చెన్నమనేని రమేష్‌కు అవకాశం దక్కక పోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను రాష్ట్ర వ్యవసాయ రంగ ప్రధాన సలహాదారుగా నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా, దుబాయ్ పర్యటన ముగించుకుని 20 రోజుల తర్వాత రాష్ట్రానికి తిరిగి వచ్చిన కేటీఆర్‌తో రమేష్ తాజాగా సచివాలయంలో భేటీ అయ్యారు. వేములవాడ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనుల అనుమతులు, కలికోట సూరమ్మ చెరువు, ముంపు గ్రామాల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులుగా నియమితులైన రమేష్‌కి మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి గురుతరమైన బాధ్యత అప్పగించిన కేటీఆర్‌తో పాటు సీఎం కేసీఆర్‌కు ఈ సందర్భంగా చెన్నమనేని ధన్యవాదాలు తెలిపారు.

సర్టిఫికెట్ల తనిఖీకి ప్రత్యేక సెంటర్!

- గురుకుల అభ్యర్థుల కోసం హైదరాబాద్‌లో ఏర్పాటు
- 1:2 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన
- 2 వారాలు కొనసాగేలా ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: గురుకుల కొలువుల నియామకాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ఏర్పా ట్లు చకచకా చేస్తోంది. ఇప్పటికే అర్హత పరీక్షలన్నీ నిర్వహించిన బోర్డు... మెజార్టీ సబ్జెక్టు లకు సంబంధించి తుది కీలను సైతం విడుదల చేసింది. ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్ కేట గిరీలకు సంబంధించి కోర్టు పరిధిలో కేసులుండటంతో ఆయా పరీక్షల తుది కీలను ఇంకా ఖరారు చేయలేదు. ప్రస్తుతం ఫైనల్ కీలు ఖరారు చేసిన సబ్జెక్టులకు సంబంధించి మెరిట్ జాబితాలను సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తోంది.

9210 పోస్టుల భర్తీకి..

గురుకుల విద్యా సంస్థల్లో ప్రధానంగా 9 విభాగాల్లో 9210 పోస్టుల భర్తీకి టీఆర్ఈఐ ఆర్‌బీ 9 రకాల ప్రకటనలు జారీ చేసింది. ఇందులో 61 సబ్జెక్టుల్లో ఈ పోస్టులున్నాయి. ఈ క్రమంలో ఒక్కో పోస్టుకు ఇద్దరు అభ్యర్థుల చొప్పున ఎంపిక చేస్తూ మెరిట్ జాబితాలు విడుదల చేస్తారు. 1:2 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ సెంటర్‌కు హాజరై పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. తొలుత జిల్లాల వారీగా పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉండడం... మరోవైపు రెండు వారాల పాటు పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తుండడంతో హైదరాబాద్‌లో ఒక కేంద్రం ఏర్పాటు చేస్తే సరిపోతుందని బోర్డు అధికారులు అంచనాకు వచ్చారు. ఈమేరకు పరిశీలన కేంద్రం ఏర్పాటు, నిర్వహణపైన కసరత్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో తేదీల ఎంపిక...

వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థి ముందుగా టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. నిర్దేశించిన తేదీల్లో అభ్యర్థికి అనుకూలంగా ఉన్న ఒక రోజును ఎంపిక చేసుకుని ఆమేరకు పరిశీలనకు హాజరు కావాలి. ఈనెల మూడో వారం నాటికి మెరిట్ జాబితాలు రెడీ చేసేలా బోర్డు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. మెరిట్ జాబితాలు ఖరారైన తదుపరి వారంలోనే పరిశీలన ప్రక్రియ ప్రారంభించనుంది.

‘ధిక్కరణ’ వేయండి.. చర్యలు తీసుకుంటాం



వినాయక విగ్రహాల నిమజ్జనంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గతేడాది రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించి హుస్సేన్‌సాగర్‌లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్(పీఓపీ)తో తయారు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారన్న ఆధారాలుంటే...ధిక్కరణ పిటిషన్ వేయాలని న్యాయవాది వేణుమాధవ్‌ను హైకోర్టు ఆదేశించింది. సరైన ఆధారాలతో పిటిషన్ వేస్తే చర్యలు తీసుకుంటామని వ్యాఖ్యానించింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చిన్నచిన్న కొలనుల్లో మాత్రమే పీఓపీ విగ్రహాలను నిమజ్జనం చేయాలన్న మధ్యంతర ఉత్తర్వులు ఇంకా అమల్లోనే ఉన్నాయని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది. పీఓపీతో తయారు చేసే విగ్రహాలపై నిషేధం ఎత్తివేయాలని, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలను కొట్టివేయాలని కోరుతూ ధూళ్‌పేటకు చెందిన తెలంగాణ గణేశ్‌మూర్తి కళాకారుల సంక్షేమ సంఘంతో పాటు మరికొందరు హైకోర్టులో 2022లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ హరేందర్ పరిషద్ వాదనలు వినిపిస్తూ.. పీవోపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయలేదని, తాత్కాలిక కొలనుల్లో చేశామని తెలిపారు. ఈ క్రమంలో న్యాయవాది వేణుమాధవ్ వాదిస్తూ.. కోర్టు ఆదేశాలున్నా పీవోపీ విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లోనే నిమజ్జనం చేశారని చెప్పారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ఆధారాలతో పిటిషన్ వేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ, విచారణను వాయిదా వేసింది.

మేనేజ్‌మెంట్ వైద్య సీట్లకు మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. వాస్త వంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఒకసారి మాత్రమే చేసుకోవాలి. ఆ తర్వాత విడతల వారీగా ఆప్షన్లు పెట్టుకోవచ్చు. కానీ కొందరు విద్యార్థులు వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్ చేసుకోలేదని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మరోసారి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కార్యాలయం తెలిపింది. పూర్తి వివరాలతో సోమవారం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేస్తుందని వెల్లడించింది.

జిల్లా వార్తలు

రేపటి నుంచి జనసేవాదళ్ జాతీయ స్థాయి శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: జనసేవా దళ్ జాతీయ శిక్షణ శిబిరం ఈ నెల 10 నుంచి ప్రారంభం కానుందని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ శతజయంతోత్సవాల సందర్భంగా దేశవ్యాప్తంగా లక్ష మంది యువకులకు శిక్షణనిచ్చే క్రమంలో జాతీయస్థాయి ఇన్‌స్ట్రక్టర్లకు పది రోజుల పాటు ఖమ్మంలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దేశంలోని 22 రాష్ట్రాల నుంచి 200 మంది హాజరుకానుండగా, ఖమ్మం బైపాస్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని తెలిపారు. కాగా, ప్రారంభ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తదితరులు పాల్గొంటారని ఆయన వెల్లడించారు.

మణుగూరు ఏరియాలో పర్యటించిన అధికారులు

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో డీఎంఎస్ (ఎలక్ట్రికల్) ఎస్.ఆనంద్ వేల్, డీవైడీఎంఎస్ (ఎలక్ట్రికల్) లడ్డా శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో కలిసి వారు ఉపరితల గనులు, కేసీహెచ్‌పీ, సబ్‌స్టేషన్లను పరిశీలించి బొగ్గు ఉత్పత్తి, రవాణా, విద్యుత్ ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమావేశమైన వారు మాట్లాడుతూ.. నిబంధనల మేరకు రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రతీఒక్కరు విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే, సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ప్రాంతాల్లో సిబ్బంది తప్ప ఇతరులు, పశువులు ప్రవేశించకుండా భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు వీసం కృష్ణయ్య, వెంకటరమణ, నర్సిరెడ్డి, శ్రీనివాసాచారి, వీరభద్రుడు, మధన్‌నాయక్, రవీందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పని చేస్తూ మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన, మృతి చెందిన కార్మికుల పిల్లలకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారికి వారసత్వ ఉద్యోగాలు ఇచ్చేందుకు కొత్తగూడెంలోని కార్పొరేట్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ సందర్భంగా డీజీఎం పర్సనల్ ధన్‌పాల్ మాట్లాడుతూ ఇంటర్వ్యూలతో పాటు వైద్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి కారుణ్య నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఎం.రమేశ్‌బాబు, కె.బాలభాస్కర్‌రావు, సుశీల్‌కుమార్, రామశేషయ్య, టీఆర్ ప్రసన్నరాజు, సాయస్వప్నిల్ పాల్గొన్నారు.

మూతపడిన విజయ డెయిరీ పార్లర్

- లీజ్ గడువు ముగిసినా రెన్యువల్ చేసుకోని నిర్వాహకులు
- డెయిరీ నుంచి పాలు, పాల ఉత్పత్తుల సరఫరాకు బ్రేక్



ఖమ్మంలో మూతపడిన ప్రభుత్వ డెయిరీ మెగా పార్లర్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ (విజయ) మెగా డెయిరీ పార్లర్ మూతపడింది. ఖమ్మం రోటరీనగర్ ప్రధాన సెంటర్‌లోని ఈ కేంద్రంలో వివిధ రకాల పాలు, పాల పదార్థాలతో పాటు విజయ బ్రాండ్ వస్తువులను విక్రయిస్తుండగా మంచి ఆదరణ లభిస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విజయ డెయిరీ పార్లర్లు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్టర్ 2017లో ఖమ్మం వచ్చినప్పుడు ఆసక్తి చూపించడంతో డెయిరీ వెంట షెడ్డు నిర్మించి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఇందులో విజయ పాలు, ఇతర ఉత్పత్తులను విక్రయించుకునేందుకు అనుమతించారు. అడ్వాన్స్‌గా రూ.3 లక్షలు, నెల కిరాయి రూ.10 వేలుగా నిర్ణయించగా.. ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. కరోనా సమయంలో మూతపడినా ఆ తర్వాత ఏడాది లీజ్ విధానంతో ప్రారంభించారు. అయితే, ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీతో లీజు గడువు ముగిసినా నిర్వాహకులు రెన్యువల్ చేసుకోలేదు. ఈ విషయాన్ని డెయిరీ అధికారులు ఉన్నతాధికారులకు తెలిపాక కాంట్రాక్టర్‌కు డెయిరీ ఉత్పత్తుల సరఫరా నిలిపి వేశారు. ఈక్రమంలో కాంట్రాక్టర్ పార్లర్‌ను ఖాళీ చేశారు. ఈ విషయమై ఖమ్మం డెయిరీ ఉప సంచాలకులు డాక్టర్ కుమారస్వామిని వివరణ కోరగా.. పార్లర్ లీజ్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పాత కాంట్రాక్టరే రెన్యువల్ చేసుకుంటారా, కొత్తగా టెండర్లు నిర్వహిస్తారా అన్నది తెలియాల్సి ఉందని చెప్పారు. కాగా, ప్రజల నుంచి మంచి ఆదరణ ఉన్న ప్రభుత్వ డెయిరీ మూతపడడంతో వినియోగదారులకు ఇబ్బంది కలగడమే కాక సంస్థకు సైతం నష్టం వచ్చే అవకాశమున్నందన అధికారులు స్పందించాల్సిన అవసరముందనే భావన వ్యక్తమవుతోంది.

గురుకులాలకు నిలిచిన పాలు, పెరుగు సరఫరా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ గురుకుల విద్యాలయాలకు మూడు రోజులుగా పాలు, పెరుగు సరఫరా నిలిచిపోయింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు విజయ డెయిరీ పార్లర్ నుంచి పాలు, పెరుగు సరఫరా చేస్తారు. ఇటీవల డెయిరీ కాంట్రాక్టర్ లీజు ముగియడంతో రెన్యువల్ చేసుకోలేదు. దీంతో విద్యాసంస్థలకు సరఫరా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఎస్సీ గురుకులాల్లో 8 వేల మంది, బీసీ గురుకులాల్లో 6 వేల మంది, మైనారిటీ, ఎస్టీ గురుకులాల్లో 6 వేల మంది విద్యార్థులు ఉండగా, వారికి మూడు రోజుల నుంచి పాలు, పెరుగు అందడం లేదు. పలు గురుకులాల్లో పెరుగును బయట కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఎస్సీ, బీసీ గురుకులాల ఆర్సీఓలను వివరణ కోరగా పాలు, పెరుగు సరఫరా నిలిచిపోయిందని, కలెక్టర్ ఆదేశాలతో శనివారం నుంచి సరఫరా పునరుద్ధరిస్తామని కాంట్రాక్టర్ చెప్పారని పేర్కొన్నారు.

మోసం చేయడంలో మోదీ, కేసీఆర్ పోటాపోటీ



మాట్లాడుతున్న హేమంతరావు, పక్కన గుమ్మడి నర్సయ్య, సుదర్శన్‌రావు, నాయకులు

- కార్పొరేట్లకు రూ.57 వేల కోట్లు దోచిపెట్టిన కేంద్రం
- ఎస్‌కేఎం సదస్సులో రైతు సంఘాల రాష్ట్ర నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రైతులను మోసం చేయడంలో అటు ప్రధాని మోదీ, ఇటు సీఎం కేసీఆర్ పోటీ పడుతున్నారని, ఇలాంటి రైతు వ్యతిరేకులను గద్దె దించితేనే వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవచ్చని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ వెల్లడించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపు మేరకు కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో శుక్రవారం జరిగిన సదస్సులో వారు మాట్లాడారు. వ్యవసాయ రంగాన్ని బతికించుకునే క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలను గద్దె దించేందుకు కార్మికులు, కర్షకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో కార్పొరేట్లకు దోచి పెడుతోందని, రైతుబంధు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కూడా మోసానికి పాల్పడుతోందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు కేవలం భూస్వాముల ఖజానా నింపేందుకే ఉపయోగపడుతున్నాయి తప్ప, సన్న, చిన్నకారు రైతులకు మేలు జరగడం లేదని తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన సఫర్‌బీమా యోజన పథకం ద్వారా రూ.57 వేల కోట్లు బీమా కంపెనీలకు దోచి పెట్టారని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఆదుకునేందుకు బీమా సౌకర్యం లేక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అనంతరం వివిధ సంఘాల నాయకులు కెచ్చెల రంగారెడ్డి, మండల వెంకన్న, మామిడాల భిక్షపతి మాట్లాడగా.. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు చంద్ర నరేంద్రకుమార్, అన్నవరపు సత్యనారాయణ, కల్లూరి కిశోర్, కందగట్ల సురేందర్, బానోత్ ఊక్లానాయక్, ఎస్కే సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య, ముత్యాల విశ్వనాథం, ఎల్.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రాథమిక సామర్థ్యాలే ప్రధానం

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



వీసీలో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్, పక్కన అధికారులు



పీఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రామచంద్రయ్య

భద్రాచలం: విద్యార్థులు భవిష్యత్‌లో రాణించాలంటే ప్రాథమిక స్థాయిలో వారి సామర్థ్యాలు పెంపొందించడమే కీలకమని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి శుక్రవారం ఆయన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులతో పలు అంశాలపై సమీక్షించారు. త్వరలో మొదలుకానున్న విద్యార్థుల కనీస సామర్థ్యాల అంచనా కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కోవిడ్ సమయంలో ప్రత్యక్ష బోధన లేకపోవడం, ఇతరత్రా కారణాలతో విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు తగ్గినందున ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ యాప్‌లో కేటాయించిన వర్గాల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి నమోదు చేయాలని చెప్పారు. అలాగే, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సూచన మేరకు పదో తరగతి విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా రూపొందించిన వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలుచేసి మెరుగైన ఫలితాలను సాధించాలని ఆదేశించారు. వీసీలో ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమణయ్య, జీసీడీఓ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

నేటి తరానికి గిరిజన సంస్కృతిని అందించాలి

ప్రస్తుత తరానికి గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను అందించేందుకు సహకరించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిలం రామచంద్రయ్యను ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ కోరారు. ప్రముఖ డోలి కళాకారుడైన రామచంద్రయ్య శుక్రవారం పీఓను భద్రాచలంలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామచంద్రయ్యను అభినందించిన పీఓ.. ఈ కళను ప్రస్తుత తరానికి అందించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

లక్కీడిప్ విజేతలకు చెక్కులు



ఖమ్మం రీజియన్‌లోని విజేతలతో ఆర్టీసీ ఎండీ సజ్జనార్, అధికారులు

హైదరాబాద్‌లో అందజేసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఖమ్మం మామిళ్లగూడెం: రాఖీ పండగ సందర్భంగా గత నెల 30, 31వ తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల కోసం లక్కీ డ్రా ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఖమ్మం రీజియన్‌లో ఆరు డిపోల పరిధిలోని బస్సుల్లో ప్రయాణించిన మహిళల నుంచి విజేతలను ఇటీవల ఎంపిక చేశారు. సత్తుపల్లికి చెందిన రుక్మిణి, కల్లూరుకు చెందిన జి.భారతి, పెనుబల్లి మండలం తుమ్మలపల్లికి చెందిన లక్ష్మి మొదటి మూడు స్థానాల్లో నిలవగా హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్టీసీ ఎండీ వీ.సీ.సజ్జనార్ బహుమతులు అందజేశారు. వీరికి వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేల చెక్కులను అందజేసి అభినందించారు. ఈకార్యక్రమంలో ఖమ్మం ఆర్ఎం సీహెచ్.వెంకన్న, డీఆర్ఎం జీ.ఎస్.పవిత్ర, ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాస్, రామయ్య తదితరులు పాల్గొన్నారు